సంఘసేవ

"శలవుల్లో ఒకరోజు"

• శ్రీమతి డి. ఎస్. రాజేశ్వరీపట్నాయక్ •

"అమ్మగోరండీ....... అమ్మోరండీ........."

తలుపు చప్పుడైంది. నిద్రాభంగమైన సునంద వులిక్కిపడి కండ్లు నులుపుకొంటూ గడియారం వైపు చూచింది. 4 గంటలు సూచిస్తోందాఘటికాయంత్రం. చీకటితెరలింకా మసక మసగ్గా దోబూచులాడుతున్నయ్. వీధి గుమ్మం మళ్ళీ తట్టిన చప్పుడు విని చప్పున వెళ్ళి తలుపు తీసింది. యెదురుగా తన సహాధ్యాయినులు సీతా, గీతా, సునీతా మృదుకంఠాలతో సుప్రభాతం చెప్పి "పెద్దమ్మగోరండీ! శానా నిద్దరోతుండారే!" అంటూ హాస్యోక్తులతో చేతుల్లో వున్న పెట్టే బేడా క్రింద పడేసి పయాణాన్ని హెచ్చరించారు.

"అరే.... మొద్దునిద్ర పట్టేసిందర్రా! సరే, నాదే ఆలశ్యమన్నమాట. అయిదు నిమిషాల్లో వచ్చేస్తున్నా" నంటూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు లోనికెళ్ళింది.

"ఇదేమిటోయ్, ఈప్రయాణ సన్నాహాలు! యిన్ని పెట్టెలెందుకూ?" అని దుస్తులేసుకుంటూ ప్రశ్నించింది సునంద.

"మరి టాక్సీలో పోతాంగదూ!" అన్నది గీత.

"మనం వెళ్ళబోయే చోటికి టాక్సీలు యెందుకమ్మా! కులాసాగా నడిచేపోదాం, ఏమంత పెద్దదూరమని, మూడు మైళ్ళేగా?" అన్నది సునంద. సరే నంటూ అత్యంతుత్సాహంగా తలలూపిన స్నేహితురాండ్రను జూచి ఎంతో పులకాంకితమైపోయింది సునందాదేవి—

ఆ తరుణ వయస్కలగు బాలికలు ప్రఫుల్లవదనాలతో కార్యదీక్షాపరులై పరిసర పల్లె ప్రాంతాలకు చరచరా ప్రయాణం. సాగిస్తున్నారు. తెల తెలవారిపోతోంది. క్రమంగా తూర్పు దిశను ఉదయ భానుడు తన అరుణ కిరణాలను నలువైపులా ప్రసరిస్తూ ఉదయించాడు. సీత చేతిలో చీపురుకట్టతో, గీత చేతిలో గంపతో, సునీత చేతిలో ఫినాయిల్ టిన్నుతో, వూగిసలాడిస్తూ ఎంతో ఠీవిగా కార్యాసక్తులై ముందు నడుస్తున్నారు. వాళ్ళు కట్టుకున్న చీరెలు ఆకుపచ్చ, తెలుపు, ఎరుపు రంగుల్లో వున్నయ్యేమో వెనుకనున్న పైటచెంగులు మువ్వన్నె పతాకంలా ముచ్చట గొల్పుతూ ఆ ప్రభాత వీచికల్లో రెప రెప లాడుతున్నయ్. వెనుక నడుస్తున్న సునందాదేవికీదృశ్యం ఎంతో శోభాయమానమై అపూర్వమైన పవిత్రాను భూతులను రేకెత్తించుచున్నయ్. తరుణ వయస్కలగు ఆ ముగ్గురి బాలికలవెంట మూడు కోట్ల సోదర సోదరీ మణులు మహాత్ముడొసగిన కర్తవ్యసాధనకై జయ నినాదాలతో విశ్వ ప్రాంగణంలో పురోగమిస్తున్నట్లనుభూతులు కలుగ సాగినయ్. వాళ్ళపద నిక్షేపంలో సుదూరమైయున్న అనాగత భవిష్యత్తు ఉజ్వలరూపంలో తీర్చి చిత్రించగల దీక్షాశయాలు బహుముఖాల ముందడుగు వేస్తున్నట్లు ఊహా పథంలో వూగిసలాడిపోతోంది. దేశసేవకై సత్యాహింసలనే కఠిన నియమాలననుష్టించి విశ్వజనీయమైన ప్రేమ సౌహార్ద్రతలు ప్రతి హృదయంలో నింపి సంఘ జీవితంలో సమత్వాన్ని నెలకొల్పిననాడే దేశం సుభిక్షమై పటిష్టమై శోభాయమానంగా వెలుగొందగలదనుకొంటూ నడుస్తోంది సునంద—

చేరవలసిన గమ్యస్థానం దగ్గిరపడింది. 'వందేమాతరం' పాడుకొంటూ వూళ్ళోకి దారి తీశారు బాలికా త్రయం. గ్రామీణజీవితాన్నెరుగని సీతా, గీతా, సునీతా ఆ పల్లె వీధుల విస్తుబోయి చూస్తూ నడుస్తున్నారు. అనుభవశాలిని యగు సునంద పల్లె దుస్థితికి పరితపిస్తూ, అడుగుల్లో అడుగు వేసుకుంటూ జీర్ణవసనాలతో మూర్తీభవించిన దరిద్రదేవతల్లా అగుపించే ముదుసలుల చిరునవ్వు మొహంతో పలుకరించి పరిచయం చేసుకొంటూ నడుస్తోంది. అది మాల వీధికి పోయేదారి. ఇండ్లముందర మురికి గుంటలు దుర్వాసన కొడుతున్నవి. ఓ ప్రక్క పందులు లట్ పట్ ధ్వనిచేస్తూ బురదనంతా అసహ్యంగా పైకి విరజిమ్ముతున్నయ్. ఆ మురికిగుంట సమీపంలో నగ్నదేహంతో ఓ కుర్రవాడు పందిపిల్లలను పట్టే చేష్టలో నిమగ్నుడై యున్నాడు. పొంగియున్న వాడి మొహంలో ఓ కంట్లో పువ్వువేసియున్నది.

"కలవుల్లో ఒకరోజు"

ముక్కునుండి కారే తరళ పదార్థం అసహ్యంగా పెదాలపైకి దాడిచేస్తూ నోట్లోకి పోతోంది. ప్రక్కనే మంటిపెచ్చులూడి కూలిపడేందుకు సిద్ధంగాయున్న ఓ గుడిసె, మిట్ట పల్లాలుగ నున్న ఆగుడిసె అరుగుపై నులక మంచంలో ఒక వ్యక్తి ప్రగల్భాలతో గలాభా చేస్తూ దొర్లుతున్నాడు. వాడి కాళ్ళ వైపున చిన్న చిన్న కుక్కుట సంతానం పరుగు పందాలతో ఆడుకొంటున్నాయ్. క్రింద మూషిక రాజాలు గొప్పలు త్రవ్వి నిరాటంకంగా అంతః పురాలు నిర్మించుకుంటున్నయ్.

"ఏయ్, ఎవరాపడుకున్నది?" జంకుతూ, లేనిగాంభీర్యం తెచ్చుకొంటూ ప్రశ్నించింది గీతాదేవి— జవాబులేదు.... యెర్రగా చింతనిప్పుల్లా మెరిసేకళ్ళతో ఎన్నో అవాచ్యాలు ప్రేలుకుపోతున్నాడావ్యక్తి. జ్వర తీవ్రతచే బాధపడుచున్న రోగి గాబోలని దగ్గరకు వెళ్ళేందుకు రెండడుగులు ముందుకేసింది. అబ్బా!.... భరింపలేని దుర్వాసనకొట్టేస్తోంది, ఛీ....ఛీ.... కల్లువాసన! దడదడలాడే హృదయంతో గిర్రున పరుగు తీసింది సునంద దగ్గరకు— "అక్కా ఏమిటుపాయం?" వణకిపోతూ సునందహస్తాన్ని బలం కొద్దీ వూగించేస్తూ ప్రశ్నించింది గీత. జరిగిన సంఘటనను విన్న సునంద "రోగంతో ప్రలాపిస్తున్నాడేమో" అన్నది.

"అబ్బా! జ్వరమూలేదూ రోగమూలేదూ. త్రాగిన మత్తులో అసందర్భంగా ప్రేలుకుపోతున్నాడు"అన్నదిగీత.

"అలా అయితే ఫరవాలేదు. వాణ్ణి లేపకుండా ఆ యిల్లంతా శుభ్రం చేసెయ్యాలి, పద నేనూ వస్తాను, యింత భయమెందుకే వెర్రిదానా" అని ప్రోత్సాహపరుస్తూ నడిచింది సునంద—

చెత్తా చెదారం తీసివేసి యిల్లంతా వూడ్చేసి, బురద ప్రదేశాల్లో గంపలకొద్దీ యిసకా, మన్నూ పోసి పరిసరమంతా శుభ్రపరిచారు సునందా, గీతా— ఈ కోలాహలాన్ని సహించలేక గ్రామ సూకరాలు గర్జించుకొంటూ పరుగులు తీస్తున్నాయి. పరుగులు తీసే ఒకటి రెండు పందులను తరిమి తరిమి కొడుతూన్న సీతను జూచి సునంద నవ్వాపుకోలేకపోయింది. చేసైగ చేసి సీతను పిలిచి సుస్నేహస్వరంతో యిలా చెప్పింది—

"సీతా, ఒకటో రెండో పందులను తరిమి కొట్టేయగా నీకర్తవ్యం పూర్తయిందా? గూడెంలో ప్రతీ యింటికీవెళ్ళి 'మీరంతా ఐకమత్యంగాయుండి, ఇల్లూ, వళ్ళూ శుభ్రం చేసుకోవాలనీ, వీధుల్లో పందులు నివసించడంవల్ల గ్రామానికెంత హానికరమో, వాటివల్ల యిండ్ల ముందర యెంత అసహ్యకరంగా బురదగుంటలు మురుగుతున్నయో, ఆ మురికి ప్రదేశాల్లో యెన్ని రోగాలు కలిగే అవకాశమున్నదీ తత్ఫలితంగా తమ పసిబిడ్డల్లో చలిజ్వరాలూ, ఉదర పొట్టలూ, కంటిజబ్బులూ ఏవిధంగా విజృంభించి రోగాలకు గురి యగుచున్నారో వివరించి, పందులు నివసించేందుకు దూరంగా ఒక 'కొట్టం' ఏర్పరచుకోవాలనీ, అవి వీధుల్లో విహరించకుండా జాగ్రత్త పడాలనీ,' వారికి తగు సలహాలతో బోధించి చెప్పాలి. ఒకటి రెండు పందులను దూరంగా తరిమేస్తే మాత్రం ఏం లాభం?" అని కార్యక్రమాన్ని సూచించింది సునంద—

తన అవివేకతను తలచుకొని సీత సిగ్గుతో తలవాల్చుకొని కర్తవ్య నిర్వహణకై నడిచి వెళ్ళింది.

"ఎబ్బే! ...ఛీ ...ఛీ...." అన్న ఛీత్కార శబ్దం విని ప్రక్కకు తిరిగి చూచింది సునంద. దగ్గరలోనున్న మురికి గుంటలో నగ్నదేహంతో పొంగియున్న పొట్టా, గోగు కాడలవలె వ్రేళ్ళాడుతోన్న ముక్కును బురదచేతులతో మొహమంతా అసహ్యం చేసుకుంటూన్న ఓ కుర్రాణ్ణి సీత ఆదరంగా చేరదీసి శుభ్రపరుస్తోన్న దృశ్యాన్ని చూచి సునీత చేసిన ఛీత్కారమని గ్రహించిన సునంద, సునీతను జూచి "అరె! అదేమిటోయ్. సునీతా! అట్లా అసహ్యపడితే ఎట్లా? రేపు నీవు తల్లివి కాబోతే నీ బిడ్డల అసహ్య పరిస్థితులుచూస్తూ ఇహ్హీ....ఛీ....ఛీ.... అని వూరుకుంటావా?" అనిచిన్నగా మందలించింది సునంద.

సునీతను చివాట్లేస్తూండే సీత హృదయం పొంగిపోతోంది, అసహ్యం లేకుండా తన కర్తవ్యం చక్కగా నిర్వహించినందుకు! ఆ ఆనందాన్ని తట్టుకోలేక సునందను జూచి "ఈకుర్రవాణ్ణి డాక్టర్ ఖానాకు పంపించేద్దామా?"అంది ఎంతో గంభీరంగా మిగిలిన కర్తవ్యాన్ని పృచ్ఛించింది సీతాదేవి.

"వాడి తల్లిదండ్రులెవరో తెలియందే ఎట్లా తీసుకుపోగలం? వాకబు చేద్దాం" అని అక్కడ విచారిస్తే— ప్రక్కగుడిసెలో తాగి తందనాలాడిన వ్యక్తియే వాడి తండ్రియని తేలింది.

"శలవుల్లో ఒకరోజు"

అప్పటికప్పుడే గూడెంలో నలువైపులా పని జరిగిపోతోంది. జీబుగానున్న చెట్లను చకచకా కోసి పారేసి చెత్తనంతా గంపల్లో యెత్తి పారేస్తోంది గీత— చీపురుతో శుభ్రంగా తుడిచి ఫినాయిల్ జల్లుతోంది సునీత. ఆకులు రాలి, కృళ్ళి పసరు వాసన కొడుతూన్న నూతిని శుభ్రం చేయిస్తూ మందు కలుపుతోంది సునందాదేవి. చూస్తుండగా హరిజనవాడంతా పరిశుభ్రంగా కనిపిస్తోంది. పిల్లలకు స్నానం చేయించి తలలు దువ్వి, ప్రతిరోజూ యిట్లా శుభ్రంగా వుండాలని చెప్తూ, చిన్న చిన్న సబ్బుబిళ్ళలూ, దువ్వెనలూ కొంచెంగా పంచిపెట్టేరు సీతా, గీతా— అయినా సంఘ సేవికల మనస్సులకు సంతృప్తి లభించలేదు.

ఆ తాగుబోతు వ్యక్తి యింకా స్పృహలేకుండా పడియున్నాడు. వీళ్ళ అధోగతికి ముఖ్యకారణం ఈ త్రాగుడు పిశాచమే! మద్యపాన నిషేధం అమల్లోకొచ్చినా మరి వీళ్ళకెట్లా మద్యం లభిస్తోందో! శాసనాలు చేస్తేమాత్రం లాభమేమిటి? మనుష్యుల్లో మార్పు రావాలిగాని! ప్రొహిబిషన్ సిబ్బందినే కన్ను గప్పిన వీళ్ళ మూర్ఖత్వానికీ, అజ్ఞానానికీ వ్యధాభరంతో ఆలోచిస్తోంది సునంద. పనులపై వెళ్ళిన హరిజనులొక్క రొక్కరే గూడెంలోకి చేరుకొని పరిశుభ్రంగా వున్న తమ నివాసాలనూ, తమ్ము ఆదరంగా పలుకరిస్తున్న ఆ అపరిచిత స్త్రీలనూ చూచి, గుస గుసలాడుతూ దిగ్భ్రాంతులై నిల్చుండిపోతున్నారు. అందరినీ పరిచయం చేసుకొని ఒకచోట సమావేశ పరచి సుస్నేహ స్వరంతో సునందాదేవి యిట్లా చెప్పింది—

"సోదరులారా! సంఘంలో మిమ్ము అంటరాని వారుగ భావించడానికి కారణం మీరు గుర్తించుకోలేక పోవుచున్నారు. మీ అసహ్య వాతావరణమే అంటరానితనాన్ని పురికొల్పింది. తాగి తందనాలాడుతూ తెచ్చుకునే కూలి రాళ్ళు దుర్వ్యయంచేసుకుంటూ భార్యా బిడ్డలను తినేందుకు గంజినీళ్ళయినా లేకుండాజేసి జీవచ్ఛవాలుగ హింసింపజేస్తున్నారు, తప్పత్రాగిన నిషాలో స్త్రీలపై చేయిజేసికొని ఒక్కోచోట ప్రాణహత్యలను చేయుటకు కూడా వెనుదీయని పరిస్థితులకు లోనవుతున్నారు. పైగా ఈ తాగ్రుడు వల్ల మీకు కలిగిన లాభమేమిటి? రోగాలను భోగిస్తూ దారిద్ర్యదశ ననుభవించడమేగాని?—"సునంద ఆర్ద్రహృదయంతో చెప్పుకు పోతోంది........

ఇంతలో ఒకహరిజనస్త్రీ దుర్వాసన కొడుతోన్న కొన్ని సారాబుడ్లు తెచ్చి "ఓ అమ్మగోర్లూ! .... మారాజు తల్లులూ! ఈ చారాబుడ్డు మావోడుతాగింది సాలకనన్నో సుక్క ఏసుకోమని పాణం తీస్తుండడండి. కల్లుపాకలు పోయినప్పటినుండి పట్టనానికి లగేజి బస్సులుకాడ బండి నడిపేనూనే (పెట్రోలు) కాఫీదుకాణాలకెల్లి ఆడపారేసిన గుండ ముద్దలు (డికాక్షన్ మడ్డి) డబ్బులిచ్చికొని రాత్రేళ అయన్నీ కశాయం మరగేసి బుడ్లకెత్తుతాడండి. అదేటో అదితాగి వోంతులు సేసుకుంటాడండి. నానేపైన అంతే కాలుతున్న బీడిముక్కతో నా ఒంటిని సురక లేస్తుండడండి .... గోడుగోడున ఏడుస్తూ .... ఓ సదుగుకున్నమ్మోర్లు! యియ్యాల ఒక్కరోజు మీరొచ్చి కల్లు తాగమోకండని సెప్పెల్లిపోతారు, మరి తెల్లారితే ఈ నాగన్నలూరుకుంటారండీ తల్లులూ" అన్నది.

"అబ్బే! .... అలాకంట తడిపెట్టకూడదమ్మా. రోజూ మేము వస్తూంటాంగా, సరేనా .... యిటు చూడు (ఆమె చుబుకాన్ని పైకెత్తి కన్నీరు తుడుస్తూ) మనమందరం మనుష్యులమేగా, ఒకరి కష్టసుఖాలు మరొకరు చూచుకోపోతే మరెవరు చూస్తారు? చూడండీ మీయిల్లూ వాకిళ్ళూ యెంత అసహ్యంగా వుంచారో! మురికి గుంటల్లో పందులు దొర్లాడుతూ దుర్వాసన కొడుతూంటే అక్కడే మీ బిడ్డలు బురదలో ఆడుకొంటూ యెన్నిరోగాలను తెచ్చుకుంటున్నారో తెలుసు కున్నారా? వీధుల్లోనికి పందులను రానివ్వకుండా దూరంగా వాటికోసం ఒకకొట్టం నిర్మించుకొని, ప్రతిరోజూ యిల్లూ వళ్ళూ శుభ్రం చేసుకొని ఈ రోగాలు రాకుండా వుండేట్లు ప్రయత్నించండి. మీరు గాంధీ మహాత్ముని పేరు వినేవుంటారు. మీకు పైజాతులతో సమానత్వంకలుగ జేసేందుకై అంటరానితనమనే నీచాభిప్రాయాలను ఖండించి దేవాలయాల్లోనికి వెళ్ళి దేవుని దర్శించుకునేందుకు మీకు హక్కున్నదని అందరినీ వొప్పించి మీక్షేమం కోసం అహర్నిశలు ఎన్నో కష్టనిష్టురాల కోర్చి హరిజననిధి యనుపేరున జీవితాంతం ఎంతోధనాన్ని సేకరించి మీకై ఎంత కృషిచేశారో తెలుసుకున్నారా? అట్టి మహనీయుని ఆదేశప్రకారం దేశం నలుమూలల్లో మీజాతి నుద్ధరించేందుకై దేశనాయకులు ఎన్నోవిధాల పాటుబడుతూ మీకు జ్ఞానబోధ చేస్తూంటే మీరింకా యిలా అజ్ఞానదశలో కొట్టుమిట్టాడుతూ అసహ్య పరిస్థితులను వదలకుండా దేశానికే అపచారం చేస్తున్నారు. యికనైనా తాగుడుమాని వృధాగా ధనవ్యయం చేయకుండా కుటుంబాలను రక్షించుకొంటూ అందరూ ఐకమత్యంగావుండడం

నేర్చుకోండి. మీఖాళీ ప్రదేశాల్లో విరివిగ కూరగాయలు పండించి, మీరనుభవించగా మిగిలినవి పట్టణాలకుచేర్చి అమ్మకం చేయండి. అందువల్ల కొంతధనం సంపాదించుకొని వేణ్ణీళ్ళకు చన్నీళ్ళవలె మీరు తెచ్చుకునే కూలికిపై రాబడి కలిపి మీ దారిద్ర్యబాధ నివారించుకునేందుకు ప్రయత్నించి సుఖంగా జీవించండి. మీబిడ్డలను పాఠశాలలకు పంపి చదువనూ, వ్రాయనూ నేర్చుకునేందుకు అవకాశం కలిగించి బిడ్డలను అక్షరాస్యులను చేయండి" అని ప్రేమార్ద్ర కంఠంతో ప్రబోధించింది సునంద.

ప్రజల గుంపులో నుండి యెవరో పెద్దగొంతుతో "అమ్మగోరూ మీరుసెప్పిన మాటలు కాదనలేం గాని తల్లీ! మీకాడున్న మంచితనం అందరికాడుంటదా? మా(పు సర్కా-రోరున్న పట్నాల్లో సొరబడితే పెద్దపెద్ద కులాలోళ్ళు ధూ .... ధూ .... మని దూరంగా పోతుండారు. మీలాగ ఆరి మనుసులు మారదుగందా తల్లీ, మాకియన్నీ సెప్పినా లాభమేటి" అన్నాడు — ఆమాటలు వినగానే సునంద హృదయం పరితపించింది. నిజమే! .... యిన్నినాళ్ళ సంస్కా-రభావాలు ఈ విధమైన ప్రశ్నతో తారుమారయి పోతోంది. తమసంస్కా-ర భావాలకు తగిలిన సవాలుని గ్రహించి శాంతంగా "మీరన్నమాటలో కొంత నిజంలేక పోలేదు. గాని వాళ్ళహృదయాలో కూడ రాను రాను మార్పు కలిగి తీరుతుంది. ఒకప్పుడు ఛీ .... ఛీ .... ఈ మాల గూడెంకి యెవరెళ్తారు? అని ఆసహ్యించుకునే మీగూడెంకి ఈవేళ మేమెందుకు రాగలిగాం? అలానే కొన్నాళ్ళకు, మీజీవితాల్లో క్రమశిక్షణల నలవరచుకొని చక్క-ని నడవడికను నేర్చుకొన్ననాడు, గతంలో మిమ్మ ఆసహ్యించుకున్నవాళ్ళందరూ మీలో కలసిమెలసి యుండగలరు. గాంధీ మహాత్ముని ఆదర్శాశయం ఫలించి తీరుతుంది. కాబట్టి మీరందరూ త్రాగుడు మానివేసి అన్యోన్య సహాయంతో ఆరోగ్య సౌభాగ్యాలను పెంపొందించుకొని దేశసౌష్టవానికి సహాయపడండి" అప్యాయంగా సమాధానం చెప్పింది సునంద.

తాగినవ్యక్తికి స్పృహవచ్చిందేమో, వాడువచ్చి "ఏటి చేలవిత్తున్నారు దొరసానమ్మోగోరూ" అని వినయంగా చేతులుమోడ్చి నిలుచున్నాడు. వాణ్ణి సీత పోల్చుకొని "అరె! దానయ్యా ... నువ్వేనా ఫారెస్టు ఆఫీసు ఛప్రాసిగా పనిచేస్తూ పెద్దపెద్ద అయ్యగార్లదగ్గర తిరుగుతూ అన్ని విషయాలు తెలుసుకొంటూ నేర్చుకున్నది, తాగితందనాలాడటమేనా? యిదేం పాడుపని?" అన్నది.

"ఛ్ఛెమించాలండమ్మోగోరూ, పేద కొంపలేపు మీ పాదాలు పడినాయి. ఎంతపున్నెం సేసుకున్నా(వో యియ్యాల! నెలముప్పయి రోజులో యిరవైతొమ్మిది రోజులు అడవులో, కొండలో, ఎండనక, వాననక, శరీరారోగ్గెం రచ్చించుకోడానికి కూసింత తాగుడబ్బేసమైంది తల్లీ, మొదటిబె(వ వదల్లేక కాసింత సుక్కే-సికుంటే శరీరానికి బలం కూడుకొత్తదని తాగేత్తానండమ్మగోరూ. ఆ తాగిన మైకాన నేనేటిసేసింది నాకేతెల్దు! రేత్తిరి ఫారెట్టు సాయిబుగారు కూత్తంత చలవు దయసేసిం(డ్రు యియ్యాల తాగి తొంగున్నాను తల్లులూ, ఈ పాలి నాతప్పుకాయండి. మరి మాగూడెంవో(ల్లందరూ కూడ తాగర్రండమ్మగోర్లూ దైవతంసాచ్చి" అంటూ లెంపలేసుకున్నాడు.

శత కంఠాలొక్క-మ్మడి జయధ్వనులు కురిపించాయి. వాళ్ళ వుత్సాహోద్రేకాలు కాస్త చల్లారేక "రోగిష్టులగు బిడ్డలకు హాస్పెటల్‌కి పంపే యేర్పాటుచేసి, సంతృప్తి హృదయాలతో సీతా, గీతా, సునీతా విజయహాసాలతో సునంద ననుసరించి తమ నివాసాల కనుసరించారు.

"ఎలావుందర్రా మన క్యాంపు?" నడుస్తూ చిరునవ్వుతో ప్రశ్నించింది, సునందాదేవి.

"సంఘసేవయనే మోహన మంత్రంలో ఎంతటి మహిమ వున్నదక్కా-యే" అన్న జవాబువిని లోలోనవారి నాశీర్వదించుకున్నది సునంద.

అలసిపోయిన ఆసహాధ్యాయినుల మొహాలో ఆనందం తొణికిసలాడుతూంటే "వందేమాతరం — మహాత్మా గాంధీకీజై" అనే విజయనాదం వారికంఠాల్లో వెలువడి ప్రతిధ్వనించింది.

ఎదురుగా పార్కు-లోనున్న "జాతిపిత" బాపూజీ శిలా ప్రతిమ వదనంలో దరహాసవీచికలు వెన్నెల వెలుగుల్లా వెదజల్లు తున్నయ్!